## కల్లూరులో మెగా వైద్య శిబిరం




# PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## మెరుగైన వైద్య సేవలు అందించాలి




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 83 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 21 మార్చి 2026

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

● రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు ● మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు ● ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు ● 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా ● జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు ● విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు ● వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు ● విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు ● పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు ● విద్యా శాఖకు రూ.26,674 కోట్లు ● వైద్య శాఖకు రూ.13,679 కోట్లు ● కార్మిక శాఖకు రూ.998 కోట్లు ● మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు ● ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు ● బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు ● మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు ● యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు ● మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు ● మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు ● ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు ● అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క








హైదరాబాద్,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను మిగతా2లో...


## గోదావరిలో ఐదుగురు గల్లంతు

● ఇద్దరి మృతదేహాలు లభ్యం ● మిగిలిన ముగ్గురి కోసం గాలింపు



భద్రాచలం,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) : గోదావరి నదిలో స్నానానికి వెళ్లినవారిలో ఐదుగురు యువకులు గల్లంతుకాగా.. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా ముగ్గురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మిగతా2లో...

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్




అమరావతి,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) : ముస్లింలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వారు ట్వీట్ పెట్టారు.ఇస్లాం మతం లో అత్యంత పవిత్రమైన మిగతా2లో...

## ఎల్పీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి




అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మడానికి వీల్లేదు

ఎపి హైకోర్టు కీలక ఆదేశాలు

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

అదుపుతప్పి వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఘటనలో ఏడుగురు దుర్మరణం



చెన్నై,మార్చి20(పిసిడబ్ల్యూ న్యూస్): తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది మిగతా2లో...

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

● అప్పలకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ

● బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



హైదరాబాద్,మార్చి20(పిసిడబ్ల్యూ న్యూస్): అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్టాన్ని భ్రష్టుపట్టించడంలో మిగతా2లో...

## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

- డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్,మార్చి20(పిసిడబ్ల్యూ న్యూస్): అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత మిగతా2లో...

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం




హైదరాబాద్,మార్చి20(పిసిడబ్ల్యూ న్యూస్):పవిత్ర రంజాన్( ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా మిగతా2లో...

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

● ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు ● మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్ ● పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది

● భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు



హైదరాబాద్,మార్చి20(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి పరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మిగతా2లో...

## ప్రేమాభిమానాల పరిమళం రంజాన్...

ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేసిన కేసీఆర్



PCW తెలుగు దినపత్రిక
శనివారం 21 మార్చి 2026

## రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభా వించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథ కం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేలకోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడ తామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

(మొదటి పేజీ తరువాయి)

మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడు సార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రా మికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రేమాభిమానాల పరిమళం రంజాన్...


### - ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేసిన కేసీఆర్




**హైదరాబాద్,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్)** : రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన 'ఈద్ ఉల్ ఫితర్' సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిరోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని, ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్న మతాల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం, ప్రగతి కోసం విద్య తదితర రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వారి జీవన విధానంలో గుణాత్మక మార్పునకు దోహదం చేశాయని వివరించారు. ప్రగతి తిరిగి పుంజుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

## ప్రీమియం పెట్రోల్‌పై రూ.2 పెంపు

- బల్క్ డీజిల్‌పై రూ.22 అదనపు భారం
- యుద్ధం నేపథ్యంలో పెట్రో వాత మొదలు




**న్యూఢిల్లీ,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్)** : పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశంలో పెట్రో వాత మొదలైంది. దేశంలో శుక్రవారం ప్రీమియం లేదా హయ్యర్ గ్రేడ్ పెట్రోల్ ధర లీటరుకు రూ.2 చొప్పున పెరిగింది. అదే విధంగా పారిశ్రామిక వినియోగం కోసం కొనుగోలు చేసే బల్క్ డీజిల్ రేటు లీటరుకు దాదాపు రూ. 22 పెరిగింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ చమురు ధరలు పెరగడంతో ఈ పెంపు ఏర్పడింది.అయితే సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పు లేదు. ప్రీమియం 95-ఆక్టేన్ పెట్రోల్ ధర ఢిల్లీలో లీటరు రూ. 99.89 నుంచి రూ. 101.89కి పెరిగింది. అదే విధంగా బల్క్ లేదా ఇండస్ట్రియల్ డీజిల్ ధర ఢిల్లీలో లీటరు రూ.87.67 నుంచి రూ. 109.59కి చేరుకుంది. ఇరాన్ యుద్ధం తీవ్రస్థాయికి చేరుకోవడంతో గురువారం అంతర్జాతీయ ముడి చమురు ధర బ్యారెల్ 119 డాలర్లు ఉంది.

## గోదావరిలో ఐదుగురు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అమరావతిలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు కూనవరం రోడ్డులోని గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు దిగారు. నది లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తూ వారిలో ఐదుగురు యువకులు గల్లంతవగా, మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకొన్నారు. గమనించిన స్థానికులు వారికోసం బోట్లపై వెళ్లి గాలింపు చర్యలు చేపట్టగా.. చారుగుండ్ల శ్రీకర్ (భద్రాచలం), పొడిచేటి అభిరామ్ (భద్రాచలం) మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురు గోక తేజ (ఉయ్యూరు), నవదీప్ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లి) కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గోదావరి ఘటనపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. భవిష్యత్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశమని సీఎం తెలిపారు. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంటూ ఈద్ ముబారక్ అని సీఎం ట్వీట్ పెట్టారు.

## ఎల్పీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి

**అమరావతి,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చమురు శుద్ధి సంస్థలు ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఎల్పీజీ కొరత ఉన్న సమయంలో చమురు శుద్ధి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయాలకు పాల్పడితే.. అది సామాన్య ప్రజలకు తీరని నష్టంతో పాటు కష్టాలను కలిగిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా చేసేందుకు వీలుగా గ్యాస్ను పంపిణీదారులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించింది.ఈ రాశుల వారికి ధనయోగం పక్కా!దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రొపేన్, బ్యూటేన్ నిల్వలను గరిష్ఠంగా ఎల్పీజీ ఉత్పత్తి కోసం ఉపయోగించడంతో పాటు ఉత్పత్తి చేసిన ఎల్పీజీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్లకు అందుబాటులో ఉంచి.. దానిని కేవలం దేశీయ వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలంటూ ఈ నెల 5న జారీ చేసిన స్వీయ ఉత్తర్వుల కఠిన అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ, కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్లను ఆదేశించింది. ఇందులో భాగంగా వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సేలం జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలుదేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర హైవేపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. ఇక.. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చంటిపాప కూడా ఉండటం విషాదకరం.మాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. గాయపడినవారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే బస్సు అదుపుతప్పి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'ప్రమాదానికి సంబంధించి పూర్తి దర్యాప్తు జరుగుతోంది. దర్యాప్తు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లౌకికవాదానికి పెద్దపీట వేస్తామని ఆయన పేర్కొన్నారు.'రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి' అని రేవంత్ రెడ్డి చెప్పారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్టల విధ్వంసాన్ని ఆపాలి

**పత్తిపాక గ్రామ పోరాటానికి సంపూర్ణ మద్దతు**
**సీనియర్ జర్నలిస్ట్, సహజ వనరుల పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దామెర రాజేందర్**



**హనుమకొండ,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో గుట్టల విధ్వంసాన్ని నిరసిస్తూ ఇప్పటికే ఒక గుట్టను కనుమరుగు చేసిన శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్లను తక్షణమే మూసివేయాలని, కొత్తగా పెద్దగుట్టపై మరో క్రషర్ ఏర్పాటు చేసేందుకు కొందరు చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలని పత్తిపాక పెద్దగుట్ట వద్ద గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, రైతులు నిరసనకు సహజ వనరుల పరిరక్షణ వేదిక సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు సీనియర్ జర్నలిస్ట్, సహజ వనరుల పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దామెర రాజేందర్ ప్రకటించారు. గ్రామంలోని సహజ వనరులను కాపాడుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రెవిన్యూ, కలెక్టర్ తో పాటు సంబంధితశాఖలకు వారు తమ ఆవేదనను స్టోన్ క్రషర్ వల్ల జరుగుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. పత్తిపాక గ్రామ సహజ వనరుల పరిరక్షణ కోసం పరితపిస్తున్న వారికి రాష్ట్రవ్యాప్త మద్దతు అవసరమని పిలుపునిచ్చారు. గుట్టల విధ్వంసం వల్ల పంటపొలాలు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన చెందు తున్నట్లు తెలిపారు. పత్తిపాకతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ గుట్టల విధ్వంసం విచ్చలవిడిగా జరుగుతున్నట్లు తెలిపారు. కొత్తగా మరోగుట్టకు స్టోన్ క్రషర్ ఏర్పాటు చేస్తే మరింత నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. గీత కార్మికుల జీవనోపాధి కూడా దెబ్బతింటోందని, క్రషర్ల నుండి వచ్చే ధూళి వల్ల తాటి చెట్లు పాడైపోతున్నాయని పేర్కొన్నారు. సమీపంలోని కుంటలు దెబ్బతినడం వల్ల చేపల పెంపకంపై ఆధారపడిన ముదిరాజ్ లు తీవ్రంగా నష్టపోతారని, అక్రమ క్వారీయింగ్ వల్ల పెద్దగుట్ట ఉనికి కోల్పోతోందని, దీనివల్ల చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని అన్నారు. తమ జీవనాధారమైన భూములను ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేనప్పటికీ స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయడం సరైనది కాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సంబంధితశాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొనసాగు తున్న స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్లను వెంటనే నిలిపివేయాలని, పెద్దగుట్టపై కొత్త క్రషర్ల ఏర్పాటుకు జరుగు తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించు కోవాలని, జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు, గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు.

# విద్యా వ్యవస్థపై సబ్ కలెక్టర్ సమీక్ష

- పాఠశాలల పనితీరు మెరుగుదలకు దిశానిర్దేశం





**పెనుబల్లి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి మండలంలోని విద్యా వ్యవస్థపై కల్లూరు సబ్ కలెక్టర్ సమగ్ర పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఎంపీపీఎస్ వీఎం బంజారా పాఠశాలలో ఈసీఆర్ పై ప్రత్యేకంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో బోధన విధానం, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించి, సంబంధిత ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం పెనుబల్లి మండల విద్యాధికారి కార్యాలయంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సీఆర్పీలు, హెడ్ మాస్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాలల సమగ్ర పనితీరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు శాతం పెంపు, బోధన నాణ్యత మెరుగుదల వంటి అంశాలపై చర్చించారు. ప్రత్యేకంగా విద్యార్థుల నేర్పుదల పెంపు, ఫలితాల సాధనలో మెరుగుదల కోసం పాఠశాలలు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.

# కల్లూరులో మెగా వైద్య శిబిరం

**225 మందికి వైద్య సేవలు..**
**52 మందికి రిఫరల్**
**ప్రారంభించిన మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**







**కల్లూరు, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కల్లూరు పిహెచ్‌సీ లో శుక్రవారం మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, 3వ వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దరావత్ మోహన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. కల్లూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కంటి, బాల్య, ఎముకల, గైనకాలజీ, జనరల్ తదితర అన్ని రకాల అనారోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన రోగులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రం నుండి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులు శిబిరంలో పాల్గొని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు. కల్లూరు పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, డాక్టర్ శరత్, వైద్య సిబ్బంది శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 225 మంది రోగులు పరీక్షలు చేయించుకోగా, 52 మందిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రజలకు సమీపంలోనే నిపుణుల వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణలో ఈ శిబిరం కీలక పాత్ర పోషించిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు ధరావత్ రవికుమార్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్న చూపు...

- బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు



**కరీంనగర్ జిల్లా,మార్చి20(పీసీడబ్ల్యూ న్యూస్):** బల్దియాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపు విషయంలో చిన్న చూపును చూసిందని దీంతో అభివృద్ధి, సంక్షేమపథకాల అమలు విషయంలో పట్టణ ప్రజలలకు తీరని అన్యాయం జరగనుందని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ కరీంనగర్ కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నిండు అసెంబ్లీ సాక్షిగా అబద్దాల అంకెలతో కూడిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. కేటాయింపులు కు వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండా అత్తెసరు నిధులను ఆయా శాఖలకు కేటాయించారనే బాధను వ్యక్తంచేశారు. కొత్త ప్రాజెక్టులు.. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదనేది ఈ కేటాయింపులతో తేటతెల్లమయిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యకు సంబంధించి యంగ్ ఇండియా స్కూల్ లకు గతంలో మాదిరిగానే నిధులు కేటాయించారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాటలకు చేతలకు పొంతన లేనివిధంగా నిధుల ప్రస్తావనను ఆర్థిక మంత్రి వినిపించారన్నారు.నేత కార్మికులకు ఈసారి తక్కువ బడ్జెట్ కేటాయించడం వల్ల సిరిసిల్ల కరీంనగర్ జిల్లాలోని చేనేత కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా పనులల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**





**ములుగు జిల్లా,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలనిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లోని గదులను, వార్డులను, అటెండెన్స్ రిజిస్టర్ ను, లాబ్, మెడికల్ స్టోర్ గది, లేబర్ రూమ్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అదేవిధంగా వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను, వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. ఇప్పటివరకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమందికి ఇవ్వడం జరిగిందని, వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని,నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని,వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని,నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని,సామాజిక ఆరోగ్య కేంద్రంలో రిపేర్లు గాని ఇతర పనులు ఏమైనా ఉన్నట్లయితే అంచనా వేసి ములుగు జిల్లా కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ దశలలో నిర్మాణం లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లను పరిశీలించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఫర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, ఏటూరు నాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ప్రజా ప్రతినిధులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో హామీలు, 6గ్యారెంటీలకు కేటాయింపులు లేవు...

- బడ్జెట్ అంకెలు, మాటలు ఘనంగా కనిపించే గారడి...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్,మార్చి20(పీసీడబ్ల్యూ న్యూస్):**ఈసారి బడ్జెట్ లో నైనా 6 గ్యారంటీలు అమలు చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా చూశారని, మళ్లీ వాళ్ళ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. బడ్జెట్లో కాంగ్రెస్ హామీలకు, ఆరూ గ్యారంటీలకు కేటాయింపులే లేవన్నారు. మహిళలకు రూ.2500 ఊసే లేదన్నారు. చేయూత కింద ఇస్తామన్నా రూ.4000 ల పింఛన్కు అతి గతి లేదన్నారు. తులం బంగారం కు నిరుద్యోగ భృతి కి కేటాయింపులు లేవన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని, బడ్జెట్ కాంగ్రెస్ హామీలకు అనుగుణంగా లేదని, బడ్జెట్ అంకెలు కేటాయింపులు, మాటలు ఘనంగా కనిపించే గారడి మాత్రమేనన్నారు. బడ్జెట్ కు విశ్వసనీయత లేదన్నారు.

# కాచిరెడ్డిపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు

## ఎస్సై వంశీకృష్ణ ప్రారంభం





**గంగాధర మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన తొమ్మిది సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందన్నారు. ప్రజల భద్రతను కాపాడడంలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బచ్చు దయాకర్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వివరించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామ భద్రతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణను సక్రమంగా కొనసాగిస్తూ, వాటి ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ఉపసర్పంచ్, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగు పెంపుకోసం రైతులకు ప్రోత్సాహకాలు: ఆత్మ ఛైర్మన్ కొండం రవీందర్ రెడ్డి



**ములుగు జిల్లా,మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లాలో పామాయిల్ సాగు పెంపు కోసం రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వ్యవసాయ యాంత్రికరణ సంస్థ ఆత్మ ములుగు డివిజన్ ఛైర్మన్ రవీందర్ రెడ్డి అన్నారు. ములుగులోని రైతు వేదికలో ఆత్మ డైరెక్టర్ లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన అధ్యక్షతన సమావేశమయ్యారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణను పెంచేందుకోసం త్వరలో జిల్లా స్థాయిలో వెయ్యి మంది రైతులతో కిసాన్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలాల వారిగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాకు 10 డ్రోన్లను కేటాయించిందని వెల్లడించారు. మహిళా సంఘాలు, రైతు ఉత్పాదక సంస్థలు, పిఎసిఎస్ లకు రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉద్యాన శాఖ ద్వారా 100% సబ్సిడీపై కూరగాయ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఆక్వా రంగంలో జిల్లా రైతాంగానికి చేయూతనిస్తామని చెప్పారు. చేపల చెరువుల కోసం భారీగా రాయితీలు ప్రభుత్వం ప్రకటించిందని, ఒక హెక్టార్ విస్తీర్ణంలో చెరువు నిర్మాణానికి ఎస్సీ/ ఎస్టీలకు 60 శాతం, మిగతా సామాజిక వర్గాలకు 40 శాతం సబ్సిడీ ఇస్తామని రవీందర్ రెడ్డి వివరించారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# సన్ షైన్ స్కూల్ పెగడపల్లి ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన వితరణ





**పెద్దపల్లి, మార్చి 20 (పిసిడబ్ల్యూన్యూస్) :** పెద్దపల్లి ప్రాంతంలో సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను ప్రతిబింబించేలా సన్ షైన్ స్కూల్ పెగడపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం విశేషంగా నిలిచింది. పెద్దపల్లి లైన్స్ క్లబ్‌ల సహకారంతో పెగడపల్లి సన్ షైన్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ నసీర్ పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సామాజిక బాధ్యతకు మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేద, నిరుపేద రోగులు మరియు వారి సహాయకులకు ఆహారం అందించడం ద్వారా వారి కష్టసమయంలో కొంత ఉపశమనం కలిగించారు. ఆసుపత్రుల వద్ద ఆహారం కోసం ఇబ్బందులు పడే పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి ఇది ప్రత్యక్షంగా ఉపయోగపడే సేవ. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ నజీర్ అన్నదానం చేయడం ఆనందాన్ని కలిగించిందని, ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టే అవకాశం రావడం దేవుని కృపగా భావిస్తున్నానని పేర్కొనడం ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక విలువను కూడా జోడించింది. సన్ షైన్ స్కూల్ పెగడపల్లి కేవలం విద్యకే పరిమితం కాకుండా సమాజానికి సేవ చేసే దిశగా ముందుకు రావడం మంచి పరిణామం. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలవాలని కోరుకుంటున్నాను

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

- బడ్జెట్‌లో విద్యారంగాన్ని మొండి చేయి
- కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అరకోర నిధులు
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులు దగ్ధం

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యు న్యూస్) :** విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటీకాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ మందు బడ్జెట్ పత్రను శుక్రవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణమాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలిసిందన్నారు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందన్నారు. కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ను కూడా విద్యారంగానికి కేటాయించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు







కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఈ సంవత్సరానికి 8.22% మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ 4343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్లు,చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వవిద్యాలయాల పరిస్థితి ఏంటని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు. కేటాయించడం తగదు. అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాల పరిస్థితి ఏంటన్నారు. సంక్షేమ వసతి గృహాలు. కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల ఊసే లేదన్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్, పాఠశాలలకు స్వంత భవనాలకు నిధులు లేవు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30%అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, జిల్లా నాయకులు పవన్, గోపి, నరేందర్, సాయి, పావని, కళావతి, శశి, హేమ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యత్వ నమోదు

● విద్యార్థి వసతి గృహానికి విరాళాల సేకరణ



**పెద్దపల్లి రూరల్ మార్చ్ 20 (పిసిడబ్ల్యూన్యూస్):** యాదవ చారిటబుల్ ట్రస్ట్ లో చేరే వారు ఈనెల 31 లోపు సభ్యత్వ నమోదు చేసుకోవాలని యాదవ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా పెద్దపల్లి ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేని రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల కమిటీలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 10 నుండి జిల్లాలో ఉన్న 13 మండలాలకు మండల కమిటీలను ఎంపిక చేస్తామని, సంఘ బలోపేతానికి కృషి చేసే నాయకత్వాన్ని గుర్తించి అవకాశం కల్పిస్తామన్నారు. మహిళ, యువత, యోప విభాగాలను కూడా నియమిస్తామని అన్నారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మింపబడుతున్న యాదవ విద్యార్థి వసతి గృహానికి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ రూ 40 లక్షలు విరాళం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న యాదవ వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఉద్యోగులు, అన్ని వర్గాల యాదవ కుల బాంధవులు భవన నిర్మాణానికి సహకరించి విరాళాలను అందించాలని కోరారు. యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకుంటున్నామని అన్నారు. యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ లో ట్రస్టీ సభ్యత్వం తీసుకోదలచిన వారు ఈనెల 31 లోపు పొందాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీ సభ్యత్వం రూ 1,10,116, ట్రస్ట్ సభ్యత్వం రూ. 10116 చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చిలారపు పర్వతాలు యాదవ్, పెగడ రమేష్ యాదవ్, గొడుగు రాజ్ కుమార్ యాదవ్, వేల్పుల నాగరాజ్ యాదవ్,గుంపుల ఓదెలు యాదవ్, బత్తిని లక్ష్మణ యాదవ్, మారం వెంకటరమణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట: రాష్ట్ర బడ్జెట్ పై ఎమ్మెల్యే కవ్వంపల్లి వ్యాఖ్య..

**కరీంనగర్ జిల్లా,మార్చి20(పీసీడబ్ల్యు న్యూస్):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ లో ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేశారని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్ లో వ్యవసాయం, విద్య,విద్యుత్, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ రంగం అభివృద్ధి కోసం రూ.26,674 కోట్లు కేటాయించడం సహేతుకమన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయరంగం అభివృద్ధి కోసం ఆ శాఖకు రూ.23,179 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలించిందన్నారు. అలాగే మరో కీలకమైన విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు కేటాయించడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. బీసీ సంక్షేమానికి రూ.12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,934 కోట్లు , మైనార్టీ సంక్షేమం రూ.3,769 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉదాతరతను చాటుకున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించారని, అందుకే ఈ బడ్జెట్ సబ్బండవర్గాల సంక్షేమ బడ్జెట్ గా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రూ. 50,713 కోట్లు కేటాయించడం ద్వారా వీటి అమ లుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం పటాపంచలు చేసినట్టయిందని ఆయన ఆయన పేర్కొ న్నారు. బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే నిర్దేశిం చుకున్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరిగినట్టుగా విదితమవుతోందని ఆయన పేర్కొన్నారు. మంచి బడ్జెట్ రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు.



# జిల్లా ప్రజలకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు,మార్చ్ 20 (పిసిడబ్ల్యూన్యూస్):** ములుగు జిల్లా ప్రజలకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల (జకాత్) ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్ద్రం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, మత సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణం...







డాక్టర్ జి ఒక యుగ ద్రష్ట...

విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు....

**కరీంనగర్ జిల్లా,మార్చి20(పీసీడబ్ల్యు న్యూస్):** భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రయాణం కొనసాగిందని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు అన్నారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ఆధ్వర్యంలో పరమ పూజనీయ డాక్టర్ హెడ్గే వార్ జయంతి , ఉగాది ఉత్సవ వేడుకలు నగరంలోని రెవెన్యూ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త గా హాజరైన ఆయన మాట్లాడుతూ పరమ పూజనీయ డాక్టర్ జి ఒక గొప్ప దేశభక్తుడు, భావితరాలకు ఒక ఆదర్శ మూర్తిగా వెలుగొందిన నాయకుడు అని కొనియాడారు. కళ్ళకు కనిపించే దృశ్యంను చూడడాన్ని దృష్టి అంటారని, భవిష్యత్తులో జరగబోయే దాన్ని ఊహించి పని ప్రారంభించే వారిని ద్రష్ట అంటారని, అలా డాక్టర్ జి భవిష్యత్తులో జరగబోయే దానిని ఊహించిన గొప్ప వారని అందుకే డాక్టర్ జి ని యుగ ద్రష్ట అంటారని తెలిపారు. 1889లో జన్మించిన డాక్టర్ జి చిన్న వయసులోనే దేశం స్థితి, దేశ బానిసత్వం గురించి ఆలోచించేవారని, స్కూల్లో చదువుకునే వయసులోనే వందేమాతరం ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ జి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేయాలనే సంకల్పం తీసుకున్నారన్నారు. ఆ రోజుల్లో డాక్టర్ జి కాంగ్రెస్ లో ఒక ముఖ్య నాయకుడిగా పనిచేశారని, గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం చేసి తొమ్మిది నెలలు జైలు శిక్షణ కూడా అనుభవించారని తెలిపారు. డాక్టర్ జి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూనే అసలు ఈ దేశం ఎందుకు పరాధీనమైంది ..? దేశ భవిష్యత్తు ఏంటి అనే ఆలోచన ఆయన మదిలో మొదలైందన్నారు. దేశ పరం వైభవ స్థితి కోసం, దేశంలో జాతీయవాదం బలపడాలనే ఆకాంక్షతో, మన సంస్కృతి సాంప్రదాయాలు ధర్మ స్థాపన సంకల్పంతో 1925 లో డాక్టర్ జి ఆర్ఎస్ఎస్ ను స్థాపించారని తెలిపారు. పట్టుమని పదిమంది కూడా లేని చిన్నపిల్లలతో ప్రారంభించిన సంఘం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందన్నారు. దేశంలోని అనేక రంగాల్లో ఆర్ఎస్ఎస్ లోని అనేక విభాగాలు పనిచేస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ కింద పనిచేసే అనేక సంస్థలు , ఆర్గనైజేషన్ లు దేశ హితం, ఐక్యత కోసం తమవంతుగా కృషి చేస్తూ ముందుకుకొనసాగుతున్నాయన్నారు. జాతీయ భావన, ఐక్యత లేని ఏ దేశం కూడా మనగడ సాధించలేదన్నారు. నేడు ప్రపంచంలోని అనేక దేశాలు ఐక్యత లేని కారణంగా ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, యుద్ధాలు చేసుకునే స్థితికి వచ్చాయన్నారు. జాతీయవాదం, ఐక్యత తో నే భారత దేశం నేటికీ వర్ధిల్లుతుందన్నారు. సంఘం వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు సమాజంలోకి పంచ పరివర్తన్ తో ముందు కొనసాగుతుందన్నారు. ముఖ్య అతిధి కోటా విద్యా సంస్థల చైర్మన్ దబ్బేట అంజి రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ లో పనిచేసే స్వయం సేవకులు సమాజం కోసం ఎంతో కమిట్మెంట్తో పనిచేస్తారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ కు తాను ఒక బార్న్ స్టూడెంట్ లాంటి ( ఇప్పుడే పుట్టిన బేబీ ) వాడినన్నారు. తన పిల్లలను మాత్రం ఆర్ఎస్ఎస్ చూపించిన మార్గంలోనే ముందుకు తీసుక వెళుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని ముందు ఉగాది ఉత్సవ వేడుకల్లో భాగంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘ చాలక్ చక్రవర్తుల రమణాచార్యులు,జిల్లా సంఘచాలక్ దుర్శెట్టి నిరంజనా చారి, నగర సంఘచాలక్ హన్మాండ్ల శ్రీనివాసరెడ్డి , లతోపాటు స్వయం సేవకులు , పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు



# నడికూడలో రంజాన్ తోఫాల పంపిణీ




**నడికూడ,మార్చ్ 20 (పిసిడబ్ల్యూన్యూస్):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల ముస్లింల పేద ప్రజల మహిళలకు,వృద్ధులకు తహసిల్దార్ రాణి, డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, జమాల్ ద్దీన్, కరీం,, అజీజ్ వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఘూలేలాల్ జీ స్ఫూర్తితో "సింధీ"లకు ప్రత్యేక గుర్తింపు...

● దేశంలో ప్రాచీన, సాంస్కృతికంగా సమృద్ధి చెందిన చరిత్ర సింధీలది. ● వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందున్న సింధీ సమాజం. ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. ● సింధీల న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా కరీంనగర్ లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి. ● సింధీల వేడుకల్లో పాల్గొన్న బండి సంజయ్.







**కరీంనగర్,మార్చి20(పీసీడబ్ల్యూ న్యూస్):** భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ఉన్న ఒక ప్రాచీన, సాంస్కృతికంగా సమృద్ధి చెందిన సమాజం సింధీలదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దేశ విభజన సమయంలో సింధీ సమాజానికి విపరీతమైన నష్టం జరిగినా, ఝూలేలాల్ జీ స్ఫూర్తితో ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రత్యేక గుర్తింపును తిరిగి తెచ్చుకుంటూ తమ సంప్రదాయాలను కొనసాగిస్తున్న ఘనత సింధీ సమాజానిదేనని పేర్కొన్నారు. ఈరోజు సింధీల ఆర్యాధ్య దైవం ఝూలేలాల్ జయంతి. తెలుగు వారికి ఉగాది పర్వదినం మాదిరిగానే ఝూలేలాల్ జయంతి రోజే సింధీలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా సింధీ సామాజిక వర్గం వారంతా కరీంనగర్ లోని గాంధీ రోడ్ వైశ్యా భవన్ సమీపంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. సింధీ యువకులు, మహిళలు ఉల్లాసంగా, ఉత్సాహంగా న్రుత్యం చేయగా, వారితో కలసి బండి సంజయ్ సైతం డ్యాన్సు చేశారు. అనంతరం సింధీలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సింధీ సామాజికవర్గాన్ని ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంశాలు.తెలుగు వారికి ఉగాది పర్వదినం ఎంతటి ప్రాధాన్యత ఉందో, సింధీ సమాజానికి ఈరోజు అంతటి ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే ఈరోజు సింధీ సమాజానికి దైవ రక్షకుడు, సింధీ ప్రజల ఆరాధ్య దైవం, మార్గదర్శకుడైన భగవాన్ ఝూలేలాల్ జీ జయంతి. ఆ మహానుభావుడు పుట్టిన రోజునే సింధీ సమాజమంతా నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటోంది. ఈ వేడుకలనే "చేటీ చంద్" పర్వదినంగా భావిస్తూ సింధ్ సమాజం పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉంది."దేవుడు ఒక్కరే, మానవత్వం ఒక్కటే"నని చెప్పిన ఝూలేలాల్ జీ జీవితం ధైర్యం, ఐక్యత, అన్యాయానికి వ్యతిరేకంగా విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. కష్టకాలాల్లో ఇబ్బందులు ఎదురైనా అంతిమంగా సత్యమే గెలుస్తుందని, ఆ విశ్వాసమే మార్గాన్ని చూపుతుందని ఝూలేలాల్ జీ ఇచ్చిన సందేశం అన్ని మతాల కులాల ప్రజలందరికీ అనుసరణీయం.అన్ని మతాలను గౌరవించాలని, న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలనే ఝూలేలాల్ జీ సందేశం చిరస్మరణీయం. ఝూలేలాల్ జీ బోధనలు నేటికీ ప్రేరణగా నిలుస్తోంది. "చేటీ చంద్" కేవలం పండుగ మాత్రమే కాదు. సింధీ సమాజ ధైర్యం, పునర్నిర్మాణం, ఆత్మవిశ్వాసానికి, సంస్కృతి, సంప్రాదాయాలకు ప్రతీక.భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ఉన్న ఒక ప్రాచీన, సాంస్కృతికంగా సమృద్ధి చెందిన సమాజం సింధీలది. నిజానికి దేశ విభజన సమయంలో సింధీ సమాజానికి విపరీతమైన నష్టం జరిగింది. ఎందుకంటే వాళ్లు నివసించే "సింధ్" ప్రాంతమంతా పాకిస్తాన్ లోకి వెళ్లిపోయింది. ఆనాడు ఇళ్ళు, ఆస్తులు వదిలేశారు. వాళ్లు నిర్మించుకున్న దేవాలయాలు ధ్వంసమయ్యాయి. ప్రాణాలను కాపాడుకోవడానికి శరణార్థ శిబిరాల్లో తలదాచుకుని చాలా కాలం కష్టాలు ఎదుర్కొన్నారు. వారికి జరిగిన ఆస్థి, ఆర్థిక నష్టం చెప్పలేనిది. తమ స్వస్థలాలను, ఆస్తులను కోల్పోయారు. మొత్తం భూభాగాన్నే కోల్పోవడంతో ఆ ప్రాంతంతో ఉన్న భావోద్వేగ బంధం పూర్తిగా తెగిపోయింది. వాళ్లకు సొంత రాష్ట్రం కూడా లేదు. అయినప్పటికీ ఝూలేలాల్ జీ స్ఫూర్తితో, ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రత్యేక గుర్తింపును తిరిగి తెచ్చుకుంటూ తమ సంప్రదాయాలను కాపాడుకుంటున్నారు.వ్యాపారం చేయడంలో సింధీలు దిట్ట. అందుకే ప్రపంచంలోనే అపర కుబేరుల స్థానంలో చోటు సంపాదించుకున్న అదానీ కుటుంబానివి సింధీ మూలాలే. బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి ప్రపంచవ్యాప్తంగా భారత వ్యాపార ప్రతిష్ట పెంచుతున్న హిందూజా గ్రూప్, ఫ్యూచర్ గ్రూప్ తోపాటు రిటైల్, మాల్స్, హాస్పిటాలిటీ రంగాల్లో దూసుకుపోతున్న లాల్ వాణీ గ్రూప్ యజమానులు కిషన్ ఆర్కే లాల్ వాణీ యజమానులు కూడా సింధీలే. అంతే కాదు... నేటి బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ సహా ఎంతో మంది సింధీ సమాజం నుండి ప్రముఖులు ఈ దేశానికి వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అద్వానీ సింధీ కమ్యూనిటీకి చెందిన వారే.ఇంత గొప్ప చరిత్ర ఉన్న సింధీ ప్రజలు "ఝూలేలాల్ జీ" బాటలో నడుస్తూ మరింతగా రాణిస్తూ సమాజానికి సేవ చేయాలని, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవాలని కోరుతున్నా.

# పెన్షనర్లకు నగదు రహిత వైద్యం

- బడ్జెట్ కేటాయింపుపై హర్షం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అమలు చేయనున్న పథకాన్ని స్వాగతించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు
- పెండింగ్ ప్రయోజనాలు, పీఆర్సీ, డీఏలపై కూడా వెంటనే నిర్ణయాలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బయ్య, తాళ్ళూరి వేణు



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలను రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం, ఇందుకోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1056 కోట్లు కేటాయించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వేణు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ఇది ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ఎంతో ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 461 ఆసుపత్రుల్లో 1999 రకాల వ్యాధులకు చికిత్స అందించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వారు అన్నారు. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర సమయాల్లో ఆర్థిక భారాన్ని ఎదుర్కోకుండా సత్వర వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా పెన్షనర్లకు డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందిస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సేవలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో రూ.1.20 కోట్ల ప్రమాద బీమా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడం కూడా శుభపరిణామమని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కుటుంబాలకు కొంత భరోసా లభిస్తుందని అభిప్రాయపడ్డారు.కొత్తగా ప్రవేశపెట్టిన ఈ ఆరోగ్య, భద్రతా పథకాల ద్వారా రాష్ట్రంలోని సుమారు 7 లక్షల 57 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నేరుగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని వారు తెలిపారు. అయితే కేవలం ప్రకటనలతో సరిపెట్టకుండా, వాటిని అమలులోకి తీసుకురావడంలో ప్రభుత్వం వేగం పెంచాలని సూచించారు. అదేవిధంగా 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు చేసి, వారికి రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డి.ఏ కరువు భత్యం విడుదల చేయడంతో పాటు, పే రివిజన్ కమిటీ (పీఆర్సీ) నివేదికను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిలబెట్టుకోవాలని, తద్వారా ఉద్యోగులు, పెన్షనర్లలో నెలకొన్న ఆందోళనలకు ముగింపు పలకాలని వారు పేర్కొన్నారు. కొత్త పథకాల అమలుతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం సమగ్ర దృష్టి సారించాలనిసంఘం నాయకులు ఆ ప్రకటనలో కోరారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా శీలం బ్రహ్మారెడ్డి

● కాంగ్రెస్ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తా ● పార్టీ విశ్వాసానికి వమ్ము చేయను ● అంకితభావానికి గుర్తింపుగా కీలక బాధ్యత



**కల్లూరు, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కల్లూరు మండలం బత్తులపల్లి గ్రామానికి చెందిన శీలం బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తున్న తన కుటుంబానికి ఈ నియామకం గొప్ప గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శీలం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా తన నియామకానికి సహకరించి, నాపై నమ్మకం ఉంచిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, నాయకుల మార్గదర్శకత్వంలో జిల్లాలోని కార్యకర్తలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను చురుకుగా నిర్వహిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల ప్రచారం, యువతను పార్టీలోకి ఆకర్షించడం, సామాన్య ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెంపొందించడం తన ప్రధాన లక్ష్యాలని శీలం బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీకి పునర్వైభవం తీసుకురావడమే తన కర్తవ్యమని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా శీలం బ్రహ్మారెడ్డి నియామకంపై పలువురు మండల నాయకులు, ప్రముఖులు, అభినందనలు తెలియజేశారు.

# నాలుగో స్తంభానికే ద్రోహమా..?

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటానికి బీజేపీ మద్దతు

పాలకుల కన్ను.. జర్నలిస్టుల స్థలాలపైనేనా..?

సొంతింటికోసం కలం యోధుల పోరు..

కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ డిమాండ్

ఆ హామీలు ఏమయ్యాయి మంత్రి పొంగులేటి..? జర్నలిస్టుల దీక్షా శిబిరంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సూటి ప్రశ్న







**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉంటూ, అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో విలేకరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది. శుక్రవారం ఈ దీక్షా శిబిరాన్ని బీజేపీ పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని, స్థానిక మంత్రుల నిర్లక్ష్యాన్ని వారు తీవ్రంగా ఎండగట్టారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు గుప్పించిన కాంగ్రెస్ నాయకులు, గద్దెనెక్కాక ఏ వర్గాన్నీ దగా చేయకుండా వదిలిపెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విలేకరులను మోసం చేయడం పాలకుల పతనానికి నాంది అని వారు హెచ్చరించారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల తీరుపై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే, తన సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించి ఇస్తానని గొప్పలు చెప్పిన మంత్రి పొంగులేటి.. ఇప్పుడు ఆ మాటలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని నిలదీశారు. ఎస్సార్ గార్డెన్స్ (ఫంక్షన్ హాల్) వెనుక జర్నలిస్టుల కోసం గతంలో కేటాయించిన భూమిపై కొందరు పెద్దల కన్ను పడిందని, దాన్ని కబ్జా చేసే ఉద్దేశంతోనే పంపిణీలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఈ న్యాయమైన సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఈ వ్యవహారంలో తనను లాగొద్దంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దాటవేత ధోరణి అవలంబించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.అవినీతి, భూ కబ్జాలతో వేల కోట్లు వెనకేసుకుంటున్న నాయకులు, సమాజం కోసం పనిచేసే విలేకరుల సొంతింటి కలను నెరవేర్చడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని బీజేపీ నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విలేకరుల పక్షాన నిలబడి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మందడపు సుబ్బారావు, రవి రాథోడ్, మంద సరస్వతి, మారుతినేని వీరభద్ర ప్రసాద్, గడిలా నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

● అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు

● తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నం

● మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్దన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ.. తీర్థాల రెవెన్యూలోని 760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు వెట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రపుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందనితెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగా రిజిస్రేష్టన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయనక్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్ తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని వారు సూచించారు.

# 700 సంవత్సరాలు గల సన్నూరు దేవాలయం

- 1310లో ఆలయ నిర్మాణం
- భక్తుడి బాధలు చూడలేక స్వయంభుగా వెలసిన వెంకటేశ్వర స్వామి
- మరో తిరుపతిగా పేరుగాంచిన దేవాలయం ఇది....










**తొర్రూరు ప్రతినిధి, మార్చి 20(పిసీడబ్ల్యూ న్యూస్):** స్వయం వ్యక్త శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ,సన్నూరు గ్రామం, మండలం రాయపర్తి ,వరంగల్ జిల్లా. 1320 సంవత్సరంలో స్వయంగా ఆవిర్భవించిన సంపూర్ణ శిలా నిర్మితమైన సప్త తల రాజగోపురం వైభవంతో విరాజిల్లుతున్న 700 సంవత్సరాల అపూర్వ చరిత్ర కలిగిన దివ్యాలయం దర్శించిన జన్మ ధన్యం. కలియుగదీషుడు పిలిస్తే పలికే దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులను అనుగ్రహించడానికి వివిధ ప్రదేశాల్లో కొలువై ఉన్నాడని తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం ,సన్నూరు గ్రామంలో వెంకటేశ్వర పల్లెలో స్వయం వ్యక్త శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిదర్శనంగా నిలుస్తోంది . 700 సంవత్సరాల క్రితం తన భక్తుడి కష్టాలు చూడలేక తనంతట తానుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వెలిసిన క్షేత్రం గా మరో తిరుపతిగా ఈ దేవాలయం పేరుగాంచింది తిరుమల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే విధంగానే ఇక్కడ కూడా విశేష ఉత్సవాలు సేవలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. **దేవాలయ చరిత్ర** సుమారు 700 సంవత్సరాల క్రితం నంగునూరు వంశానికి చెందిన ఓ భక్తుడు ప్రతి సంవత్సరం తిరుమలకు పాదయాత్ర చేసి స్వామిని దర్శించుకునే వాడు ప్రతి సంవత్సరం తిరుపతికి వెళ్లి స్వామిని దర్శించుకునేందుకు వెళ్లేవారు. ఒక సంవత్సరం అదేవిధంగా పాదచారుడై ఈ మార్గం గుండా వెళుతుండగా ఆయాసంతో వెళ్లలేక పడిపోయాడు ఆ రాత్రి ఆ భక్తుడి కలలో స్వామి కనిపించి నీ భక్తికి మెచ్చాను ఇక నుండి నువ్వు పడే కష్టాలు పడుతున్న పడుతూ ఏడుకొండలుకి నా దగ్గరికి రావలసిన అవసరం లేదని పేర్కొన్నాడు నేనే స్వయంగా మీ గ్రామంలోని వేలుస్తానని ఆలయం నిర్మించి నన్ను సేవించుతూ తరించు అని చెప్పాడు. అందుకు నిదర్శనంగా ప్రస్తుత ఆలయానికి వాయువ్య దిశలో ఒక పెద్ద బండరాయి మూడు ముక్కలుగా పగులుతుందని అందులో దక్షిణముఖంగా వెంకటేశ్వర స్వామి ఆవిర్భవించారు. ఉదయం మేల్కొన్న భక్తుడు కలలో వచ్చిన విధంగానే అక్కడ చూడగా స్వామి వారిని చూసి పూజలు నిర్వహించారు. స్వామి స్వయం వ్యక్తంగా వెలిసిన చోట ఆలయ నిర్మాణానికి పూనుకోగా బండ్ల రాతిని తొలగించడం దేవాలయం నిర్మిస్తే ఇబ్బంది కలిగి నిష్ఫలంగా అవుతుందని బాధపడుతుండగా పండితుల సలహాతో 41 రోజులపాటు శ్రీనివాస దీక్ష నిష్ఠతో చేపట్టి ఏదైనా పరిష్కారం మార్గం చూపుతారని తెలుపటంతో ఈ విధంగా వెంకటేశ్వర స్వామి సేవించాడు ఆ భక్తుడు చేపట్టిన దీక్షకు మెచ్చిన వెంకటేశ్వర స్వామి తూర్పుముఖంగా ఆవిర్భవించారు సంతోషించిన భక్తుడు వైష్ణవ సాంప్రదాయంలో ముఖ్యులైన పన్నిద్దా రాల్వా రాదులుగా అవతరించిన రూపాన్ని చూసి సంతోషపడిన అక్కడ గర్భాలయం నిర్మాణం చేపట్టారు ఆలయ క్షేత్రం పాలకుడిగా అక్కడ శివుడు నిరుస్తున్నాడు ఈశాన్య శ్రీ దిశలో శివాలయాన్ని నిర్మించి పరమేశ్వరునికి పూజాదికాలు నిర్వహించేస్తున్నారు వరంగల్ జిల్లా, రాయపర్తి మండలానికి చెందిన ఆరుట్ల వంశస్తులైన అర్చకులుగా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించేవారు ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోగా కుందూరు వంశస్థులు, ఎర్రబెల్లి వంశస్థులు సంయుక్తంగా ఆలయానికి ముఖమండపం, అర్ధమండపం గోదా సన్నిధి రామానుజ నమ్మాల్వార్, మనవాల్ మహాముని ప్రత్యేక సన్నిధిలో ధ్వజస్తంభం, యాగశాల, రామానుజకుటం, కొట్టాడి, వాహనశాల ,సింహద్వారం, కళ్యాణమండపం నిర్మించారు. స్వామివారికి అధ్యాయ నో త్సవం, బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం ప్రారంభించారు. దీనితో ఈ ఆలయ ప్రాశస్తం ఈ ప్రాంతంలో నాలుగు మూలల వ్యాపించి విశేషంగా భక్తులు రావడంతో సన్నూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం మరో తిరుపతిగా ఖ్యాతి గడించింది. భక్తులకు కోరిన కోరికలు తీర్చే కోడేలు కట్టి విశిష్ట సాంప్రదాయం గల ఏకైక శ్రీ వైష్ణవి క్షేత్రంగా దేవాలయం కొంగు బంగారం లా నిలుస్తోంది .**అధ్యాయ నోత్సవాలు ...బ్రహ్మోత్సవాలు** వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక మాఘ శుద్ధ దశమి నుంచి త్రయోదశి వరకు మాఘ శుద్ధ త్రయోదశి సాయంత్రం నుండి మాఘశుద్ధ బహుళ పంచమి వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అనువంశిక అర్చకులు ఆరుట్ల రంగాచార్యులు తెలిపారు .ఈ ఉత్సవాల్లో స్వామివారు దేవేరులతో కలిసి చిన్న విశేష వాహనం, పెద్ద శేష వాహనం, పల్లకి, తీరుచ్చి, హనుమత్, గరుడ, గజ, అశ్వ, దేవరాజ కలింగ్ వాహనాలపై గిరిప్రదక్షిణ చేస్తారు . మాఘ శుద్ధ పౌర్ణమి రోజు రాత్రి 7 గంటల సమయానికి స్వామివారికి తిరుకళ్యాణం నిర్వహిస్తారు . **ఉత్సవాల విశేషాలు ...** ఉగాది రోజున పంచాంగ శ్రవణం ప్రతినెల శ్రావణ నక్షత్రం నాడు శ్రీనివాస కళ్యాణం, శుద్ధ పాద్యమినాడు శ్రీవారి అభిషేకం బహుళ చతుర్థి రోజున సుదర్శన శ్రీనివాస హోమం, ఏకాదశి రోజున శ్రీ విష్ణు సహస్రనామార్చన, శవన్నవరాత్రుల సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి కి అష్టలక్ష్మి అలంకారంతో రోజు ఒక దర్శనం నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతం రాత్రి సమయంలో దీపోత్సవం ధనుర్మాస ఉత్సవాలు 30 రోజులపాటు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. భోగి రోజున పూజా రంగనాదుల కళ్యాణం వేడుకలు ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, గరుడ వాహనం, శ్రీవారి దర్శనం నిర్వహిస్తారు అలాగే తీరు నక్షత్రం ఉత్సవాలను కూడా బ్రహ్మాండం నాయకుడికి కన్నుల పండుగగా నిర్వహిస్తారు. **భక్తుల మనసులోని మాట ...** తెలంగాణ రాష్ట్రంలో మరో తిరుపతి గా వేలసిన వెంకటేశ్వర స్వామి దేవాలయం వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం, చెన్నూరు గ్రామంలో ఉన్నది. ఈ ప్రాంతానికి అనేక జిల్లాల నుండి ఇక్కడికి భక్తులు చేరుకుని వెంకటేశ్వర స్వామిని ఆరాధిస్తున్నారు. అందులోని శ్రీ వెంకటేశ్వర స్వామిని తొలిసారిగా దర్శించుకునేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ,వలిగొండ మండలం నుండి వృద్ధ దంపతులు పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు పరాంకుశం కృష్ణస్వామి దంపతులు ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు. మరో దంపతులు అన్న ప్రసన్నం చేయడం జరిగింది వారిని పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు మనోహర స్వామి వారిని పలకరించగా మరో తిరుపతిగా పిలిచే సన్నూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవటం ఇది తొలిసారి అని ఎంతో ప్రశాంతంగా ఆలయం ఉండటం మాకెంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు విశాలమైన ప్రదేశం ప్రశాంత వాతావరణం నెలకొన్న ఉండటం దేవుడు సన్నిధిలో ఎంతసేపు కూర్చున్నా బయటికి వెళ్లాలని అనిపించకపోవడం విశేషం అని అన్నారు. **వార్తా సేకరణ** శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నూరు దేవాలయం ఆలయ విశిష్టత వార్తా సేకరణ న్యూస్ జర్నలిస్ట్ తిరునహరి మనోహర స్వామి, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మాజీ ఎంపీపీ వెంకటస్వామి వారి ద్వారా సేకరించటం జరిగింది. **అనువంశిక అర్చకులు.;;;–**ఆరుట్ల రంగాచార్య రామకృష్ణమాచార్య వెంకటరమణాచార్య ప్రధాన పూజారి సెల్ నెంబర్

## ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడు బండారి లక్ష్మారెడ్డి: బోసాని పవన్ కుమార్



**ఉప్పల్ మార్చి20 (పి సి డబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య పరంగా ఆర్థిక సహాయం అందించే దిశగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి ముందడుగు వేశారు. పేద కుటుంబానికి చెందిన బాధితురాలు రామంతాపూర్ శ్రీ నగర్ కాలని కి చెందిన మమత అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2 లక్షల 75 వేల రూపాయల విలువైన గూజ ను అందజేశారు. ఈ LOC ద్వారా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించారు. CMRF లోని గూజ విధానం ద్వారా పేద రోగులకు ముందస్తు డబ్బు చెల్లించకుండా ఆసుపత్రుల్లో చికిత్స పొందే సౌకర్యం కల్పించబడుతుంది. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బోసాని పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైనప్పుడు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పేద ప్రజల ఆరోగ్య రక్షణే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దయాకర్ రెడ్డి, గణేష్ యాదవ్, పాండు , ఆనంద్ యాదవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వై జంక్షన్ వద్ద చెత్త కుప్పలు ప్రజల ఆరోగ్యానికి ముప్పు

**ఏటూరు నాగారం, మార్చి20 (పి సి డబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలోని వై జంక్షన్ వద్ద హోటల్ యజమానుల నిర్లక్ష్యం కారణంగా చెత్త సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. హోటళ్లలో ఏర్పడే చెత్తను చెత్తబండి లేదా చెత్తకుండీలలో వేయాల్సిన బదులు, రోడ్డుపక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం చెత్త కుప్పలతో నిండిపోయి, దుర్వాసన వ్యాపిస్తోంది. రోడ్డుపై వెళ్లే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా చెత్తను కుక్కలు, పశువులు తినడం వల్ల వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్




కవర్లు తినడం వల్ల గోమాతల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, వై జంక్షన్ వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. స్థానికుల మాటల్లో, "ప్రతి హోటల్ ముందు చెత్త బుట్టలు ఉండాలి. చెత్తబండి వచ్చినప్పుడు అందులోనే చెత్త వేయాలి. కానీ హోటల్ వాళ్లు ఇష్టానుసారంగా బయట పడేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి:చెత్తను సరైన విధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలిహోటల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి జరిమానాలు విధించి, శుభ్రతపై అవగాహన కల్పించాలిఅని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## ఇంటి దగ్గరే వండి.. పాఠశాలకు మోసుకెళ్తున్న వంట కార్మికులు మానసపల్లిలో దయనీయ పరిస్థితి



**ఏటూరునాగారం,మార్చి20 (పిసి డబ్ల్యూ న్యూస్):** మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మానసపల్లి గ్రామం 12వ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వద్ద వంట చేసేందుకు కనీసం షెడ్డు కూడా లేకపోవడంతో, వారు తమ ఇళ్లలోనే మంట మడి (చుల్లు) దగ్గర వండి, ఆహారాన్ని తలపై మోసుకుని పాఠశాలకు తీసుకెళ్తున్నారు. గత పది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని వంట కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు, వర్షాలు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఇలా పని చేయడం చాలా కష్టంగా మారిందని వారు చెబుతున్నారు. కనీసం ఒక వంట షెడ్డు ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరుతున్నారు. ఇదిలా ఉండగా, మానసపల్లి 12వ వార్డులో ప్రభుత్వానికి చెందిన స్థలాలు ఉన్నప్పటికీ అవి ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో మూడు బావులు ఉండేవని, ప్రస్తుతం అవి కనిపించకుండా ఆ స్థలాలు ఇతరుల ఆధీనంలోకి వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై పీసీడబ్ల్యూ రిపోర్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పూర్తి స్థాయి విచారణ జరిపి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలు కూడా ఈ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, వంట షెడ్డు, అంగన్వాడీ కేంద్రం, కమిటీ హాల్ వంటి ప్రజా అవసరాల కోసం వినియోగించాలని కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి: కలెక్టర్ దివాకర సూచనలు



**ఏటూరునాగారం,మార్చి20 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్యాస్ సిలిండర్ల బుకింగ్ మరియు వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. శుక్రవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ బుకింగ్‌ల మధ్య కనీసం 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. గడువు పూర్తికాకముందు బుకింగ్ చేస్తే ఓటిపి రాదని, వినియోగదారులు అనవసరంగా ఏజెన్సీల వద్దకు రావద్దని సూచించారు. బుక్ చేసిన వారికి నిర్ణీత సమయంలోనే ఇంటి వద్దకు సిలిండర్లు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. ఓటిపి వచ్చిన వారికి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి సరఫరా చేయాలని, ఓటిపి రాని వారికి హెల్ప్ డెస్క్ ద్వారా పూర్తి సమాచారం అందించాలని అధికారులకు ఆదేశించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 8 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 86,896 గృహ కనెక్షన్లు, 254 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. రోజుకు సుమారు 942 సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. ప్రజలు అపోహలు వీడి నిబంధనల ప్రకారం మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌పై అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎం సివిల్ సప్లయ్ క్రిష్ణ వేణి, డీటీ విజయ్ కుమార్, సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర, సోదరీమనులకు రంజాన్ శుభాకాంక్షలు

- అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్
- శాసనసభలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంజాన్ పండగ నేపథ్యంలో ముస్లిం సోదరులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ అంటే ఉపవాసాలు, దైవారాధన, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కర్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించడం అని అన్నారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ సామరస్యానికి,సుహృద్భావానికి, సర్వమానవ సమన్వత్వానికి కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు. "అల్లాహ్ ఆశీర్వాదాలు మీపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఈరోజు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజక బడ్జెట్ అని అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్ అని అన్నారు. ఆర్థిక వ్యవస్థ పునర్జీవానికి పునాది వేసిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడంపై దృష్టి సారించారని, డాంబికాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ను రూపొందించారని, విద్య, వైద్యం, వ్యవసాయ, ఇందిరమ్మ ఇండ్లు, ఆరు గ్యారంటీల అమలుకు పెద్దపీట వేశారని, ఎస్సీ, ఎస్టీ, బిసి ల సంక్షేమానికి కేటాయించారని అదేవిధంగా పేద ప్రజలకు అండగా ఉండే విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రూపు దిద్దారని ఉద్ఘాటించారు.

## రంగారావుపల్లి ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు స్థలము పరిశీలించిన ఆర్డీవో



**గంగాధర మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి గంగాధర మండలం రంగరావు పల్లె గ్రామం నుండి కొత్తపెల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ లో ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితుల కోసం ఇళ్లస్థలాలకు కొరకు గర్శకుర్తి గ్రామ శివారులోని విలాసాగర్ రోడ్డులో గల ప్రకృతి వనం దగ్గర ప్రభుత్వ స్థలాన్ని చూడడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, రంగరావుపల్లి గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య ఆర్ ఐ, సర్వేయార్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ వర్ధంతి సందర్భంగా ఫాతేహ ఖానీ.. ప్రార్థనలు

**కరీంనగర్ టౌన్ మార్చి 19(పిసిడబ్ల్యూ న్యూస్):** 29వ రంజాన్ మాసం పురస్కరించుకుని అఖిల భారత ఎంఐఎం మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ 18వ వర్ధంతి సందర్భంగా గురువారం కరీంనగర్ దారుస్సలాంలో ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఫాతేహా ఖానీ, ప్రత్యేక దుఆ ప్రార్థనల కార్యక్రమం జరిగింది. హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖతం ఖురాన్ చదవగా, మౌలాన ఖయ్యూం జియాయి దుఆ చేశారు. సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ సేవలు చిరస్థాయిగా చిరస్మరణీయంగా నిలిచి పోతాయని, ఆయనను స్వర్గం ప్రసాదించాలని అల్లాహ్ ను వేడుకున్నారు. బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీల కుటుంబీకుల ఆరోగ్యం కోసం, ఎంఐఎం పార్టీ దేశవ్యాప్తంగా విస్తసరించి అభివృద్ధి చెందాలని, అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వం దేశ వ్యాప్తంగా వర్ధిల్లాలని, ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థులు ఘనవిజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఆతిన, ఇబ్రహీం, కార్పొరేటర్ మొహసీన్ మొహియుద్దీన్, నాయకులు బాబుజానీ, అజర్ దబీర్, అరిఫ్ అహ్మద్, వాజిద్ అలీఖాన్, సాజిద్, షబ్బీర్, నిజాం, జబ్బార్, షాకిర్ నష్వా, పార్టీ డివిజన్ స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధి ఒట్టి బూటకం

- ఎస్సీ సంక్షేమానికి 70శాతం నిధుల కోత
- కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి భారీగా నిధుల కోత విధించడం దళితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోందని, గత బడ్జెట్‌లో రూ.40,232 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం రూ.11,784 కోట్లు మాత్రమే చూపించడం అన్యాయం. ఇది సుమారు 70 శాతం కోత పెట్టిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. దళితుల అభివృద్ధి పేరుతో మాటలు మాత్రమే చెప్పి, ఆచరణలో మాత్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టమవుతోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'దళిత బంధు' పేరిట రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి అమలు చేయలేకపోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'అంబేద్కర్ ఓవర్సీస్' పథకం ద్వారా రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించినప్పటికీ, బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు వారి సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టడం బాధాకరమని, దళితుల అభివృద్ధిపట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.50,000 కోట్లు ఎస్సీ సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళితుల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని వారు హెచ్చరించారు.

## కరీంనగర్‌లో రంజాన్ తోఫా కిట్ల పంపిణీపై వివాదం..

**కరీంనగర్ టౌన్ మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలకు తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న నేపథ్యంలో కరీంనగర్ నియోజకవర్గంలో అసమాన పంపిణీపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో అధికారులకు బాధ్యతలు అప్పగించి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కోఆర్డినేటర్లుగా నియమించి ప్రతి డివిజన్‌లో అర్హులైన వారికి తోఫా కిట్లు అందించాలని సూచించినట్లు సమాచారం. అయితే కరీంనగర్‌లో ఈ ప్రక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 66 డివిజన్లకు సుమారు 1800 తోఫా కిట్లు కేటాయించగా, ప్రతి డివిజన్‌కు సగటున 100 కిట్లు ఇవ్వాల్సి ఉండగా, 32వ డివిజన్‌కు ఒక్క కిట్ కూడా అందలేదని స్థానిక కార్యకర్తలు వాపోతున్నారు. ఈ డివిజన్‌లో 5400కు పైగా మైనార్టీ ఓటర్లు ఉన్నప్పటికీ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇదే సమయంలో పక్కనే ఉన్న 33వ డివిజన్‌కు 150 తోఫా కిట్లు ఇవ్వడం అన్యాయంగా ఉందని వారు పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా పార్టీని బలోపేతం చేసిన తమలాంటి కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలని పదేపదే సూచిస్తున్నప్పటికీ, కరీంనగర్‌లో స్థానిక నాయకులు ఆ మార్గదర్శకాలను పాటించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో చేరిన వారికి, నాయకులకు సమీపంగా ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తూ, కష్టపడి పనిచేసిన పాత కార్యకర్తలను పక్కన పెట్టారని ఆరోపించారు. ముఖ్యంగా 32వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన నాయకులు, కార్యకర్తలకు పూర్తిగా నిర్లక్ష్యం చూపినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని 32వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా

**- దాతృత్వం చాటుకున్న 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాణాల లక్ష్మణ్**



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతి పవిత్రమైనది పండుగ రంజాన్. అట్టి పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్ష అవలంబించి నేడు రంజాన్ పండుగను జరుపుకోబోయే 46 వ డివిజన్ లోని ముస్లిం కుటుంబాలకు డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాణాల లక్ష్మణ్ రంజాన్ తోఫా ను అందజేసి దాతృత్వం చాటుకున్నారు. డివిజన్ లోని పార్టీ పెద్దలందరీ సమక్షంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. బాణాల లక్ష్మణ్ ప్రతి సంవత్సరం రంజాన్ పండుగకు ముస్లిం కుటుంబాలకు తోఫా అందజేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాడని, అన్ని కులాలను, మతాలను గౌరవిస్తూ వారి వారి సంప్రదాయాలకు అనుగుణంగా వారికి అవసరమైన సరుకులు అందజేయడం అలవాటుగా పెట్టుకున్నాడని డివిజన్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ చేదోడు వాదోడుగా ఉంటున్న బాణాల లక్ష్మణ్ ను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నా అంటూ డివిజన్ ప్రజలను ఆదుకుంటున్న అతనికి ఆ భగవంతుడు మేలు చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, జట్ల కిష్టయ్య, కాటన్ కొమరయ్య, దేవర వెంకన్న, మోటే పాపులు, చిత్తూరు వెంకటేశ్వరరావు, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తుపాకుల మధు, మన్నే హరికృష్ణ, మేకల అశోక్, చల్లా సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జికే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం

**ముఖ్య అతిథి: ఈగ శ్వేతా రాజు ముదిరాజ్**
**మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మార్చి 20,(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ దమ్మాయిగూడ డివిజన్ లోని ఆర్ జీ కె కాలనిలోని ఆర్ జి కే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 18/03/26 న శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం సందర్భంగశ్రీ అభయాంజనేయ స్వామి టెంపుల్ లో పంచాంగ శ్రవణము మరియు ఉగాది పచ్చడి కార్యక్రమము ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఈగ శ్వేతా రాజు మాట్లాడుతూ మన భారతదేశ సంస్కృతి చాలా గొప్పదని ఈ దేశం లో అన్ని కులాలు అన్నమతాలు వారు ఉన్నారని అందరు ఒకే కుటుంబం లాగా ఆప్యాయంగా ఉంటారని అలాగే రాజీవ్ గృహకల్ప కాలని ఒక చిన్న భారతదేశం అని ఇందులో దేశం



లోని దాదాపు అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ జీవితున్నారని అన్నారు నేను ప్రస్తుతం రాజకీయ ప్రయాణం కొనసాగుతన్ను అంటే మా ఈగ రాజు ముదిరాజ్ తో పాటు రాజీకే కాలనీ అందరు ఆశీస్సులు, సహకారం తో ముందుకు సాగుతున్నాను అందుకు ధన్యవాదములు అన్నారు ముక్యంగా ఈ కాలాని యూవత, ఇంటి యజమానులు నన్ను పదే పదే కోరుతున్నా తక్షణ సహాయం ప్రతి బ్లాకు లో డ్రైనేజిల శాశ్వత పరిష్కారం, గ్రంధాలయం మరియు ఓపెన్ జిమ్ కొరకు మీరు శ్రమించలని కోరుచున్నారు. తప్పకుండ కాలనీ ప్రజలకు హామీ ఇస్తున్న మనది ప్రజా ప్రభుత్వం కాబట్టి తప్ప కుండా ఈ పెద్ద బాధ్యత ను నెరవేర్చే ప్రయత్నం చేస్తాను అన్నారు. కార్యక్రమంలో ఆర్ జి కే కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పోతరాజు రాములలు,జనరల్ సెక్రటరీ ఈగ రాజు ముదిరాజ్ , సలహాదారులు తిరుపతి జగన్నాధం, వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, జల నరసింహ, జాయింట్ సెక్రెటరీ మహేష్ శెట్టి, సాయి రెడ్డి, ఆర్గనైజర్ సెక్రెటరీ ముద్దసాని నరేష్, సాయిబాబా కమిటీ సభ్యులు పి రాజు, కుమ్మరి నరసింహ, పి నరసింహ, యోగేష్ సింగ్, ప్రేమ్చందర్ రెడ్డి, కాలనీ ప్రజలు కన్నయ్య శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటేష్, స్వామి కాలనీ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## 49వ డివిజన్ కార్పొరేటర్ ఏన్నం లక్ష్మి ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



**కరీంనగర్ టౌన్ మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ49 వ డివిజన్ కార్పొరేటర్ ఏన్నం లక్ష్మి ప్రకాష్ ఆధ్వర్యంలో ఉగాది పరాప నామ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ లక్ష్మి ప్రకాష్ మున్సిపల్ కార్మికులందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి , ఉగాది పచ్చడి, భక్షాలు, స్వీట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్మికులందరినీ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లంబు సుధాకర్ రెడ్డి, ముదుగంటి ప్రవీణ్, గాదగొని రమేష్ గౌడ్, జవాన్ లక్ష్మయ్య తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## కరీంనగర్ రూరల్ తహసిల్దార్‌ను కలిసిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు




**కరీంనగర్ జిల్లా మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలంలో ఇటీవల విధుల్లో నియమితులైన తహసిల్దార్ జి. నర్సింహారావుని జాతీయ మానవ హక్కుల కమిటీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో మండలంలోని ప్రజల సమస్యలు, ముఖ్యంగా ఆదాయ, భూ సమస్యలు, పౌర సేవల అందుబాటు వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా సేవలు అందించాలని సుధాకర్ కోరగా, తహసిల్దార్ నర్సింహారావు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా ప్రపంచ సంతోష దినోత్సవ వేడుకలు





**- సుమారు 200 మందితో 'ఆనందోబ్రహ్మ హ్యాపీయెస్ట్ పర్సన్ చాలెంజర్స్ మేళా' నిర్వహణ**

**- ఆనందం, శాంతి, ఆరోగ్యమే లక్ష్యమని నిర్వాహకుల పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం పట్టణంలోని జడ్పీ మీటింగ్ హాల్లో శుక్రవారం ప్రపంచ సంతోష దినోత్సవం, తెలుగు శ్రీ పరాభవ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ లాఫ్టర్ యోగ నేషనల్ యూనివర్సిటీ, తెలంగాణ యోగ సంఘం, యాంటీ ఏజింగ్ హ్యాపీనెస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆనందోబ్రహ్మ హ్యాపీయెస్ట్ పర్సన్ చాలెంజర్స్ మేళా'కు సుమారు 200 మంది హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం 'బీపీ లేని హ్యాపీ తెలంగాణ బీపీ లేని హ్యాపీ భారత్' అనే సందేశాన్ని సమాజంలో విస్తృతంగా చాటడం అని నిర్వాహకులు తెలిపారు. ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఆందోళనల మధ్య మనుషులు ఆనందాన్ని కోల్పోతున్న తరుణంలో, నవ్వు, యోగ, సానుకూల ఆలోచనల ద్వారా శారీరక-మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే ఈ మేళా లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మరికంటి వెంకట్, కేజీ టు పీజీ యోగ సిలబస్ పిల్ దాఖలు చేసిన హైకోర్టు అడ్వకేట్, హైదరాబాద్ లాఫ్టర్ యోగ నేషనల్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, మాట్లాడుతూ.. నేటి ప్రపంచం అశాంతి, అసంతృప్తి, ఆవేదనలతో నిండి ఉందన్నారు. మనుషుల మధ్య సంతోషం తగ్గిపోవడం, సహనం క్షీణించడం వల్లే సమాజంలో ఘర్షణలు, దేశాల మధ్య యుద్ధ వాతావరణాలు ఏర్పడుతున్నాయని వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లో ఆనందం, నవ్వు, మానసిక ప్రశాంతతే శాంతికి మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఈ హ్యాపీయెస్ట్ పర్సన్ చాలెంజర్స్ మేళా ద్వారా సమాజంలో శాంతి, సంతోషం, సానుకూలతను పెంపొందించవచ్చని మరికంటి వెంకట్ అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, వ్యక్తిగత ఆనందం నుంచి కుటుంబ సౌఖ్యం, అక్కడి నుంచి సమాజ శాంతి దిశగా ప్రయాణం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి ఎస్.కే. కృష్ణబాబు, కల్లూరు శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ, మండల, జిల్లా కేంద్రాల స్థాయిలో చాలెంజర్స్‌ను నియమిస్తూ వారికి ప్రత్యేక సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారిలో ఉత్సాహం నెలకొనగా, సంతోషం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమనే నమ్మకాన్ని నిర్వాహకులు వ్యక్తం చేశారు. మొత్తంగా ప్రపంచ సంతోష దినోత్సవం, తెలుగు నూతన సంవత్సర సందర్భంగా నిర్వహించిన ఈ మేళా ఖమ్మం నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆనందం, ఆరోగ్యం, శాంతి అనే మూడు మౌలిక విలువలను ఒకే వేదికపై ప్రజలకు చేరువ చేసిన ఈ కార్యక్రమం పాల్గొన్న వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# భక్తులకు శుభవార్త

• వాడపల్లికి డీలక్స్ బస్సు ప్రారంభం • ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్






**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆదేశాల మేరకు భక్తుల కోరిక మేరకు ఖమ్మం నూతన బస్టాండ్ నుండి వాడపల్లి వరకు డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభించినట్లు ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ఈ బస్సు ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఖమ్మం నుండి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. వాడపల్లిలోని ప్రసిద్ధ దేవస్థానానికి వెళ్లే భక్తులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 9136446666 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో www. tgsrtc bus.in ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉందని మేడా శివప్రసాద్ పేర్కొన్నారు.

# ఖమ్మంలో 'కింగ్స్ బజార్ హోమ్ నీడ్స్ జోన్' ప్రారంభం

- ఉగాది సందర్భంగా సాన్ ఎంటర్‌ప్రైజెస్ నూతన షోరూమ్ ఆరంభం

- బ్రాండెడ్ హోమ్ నీడ్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ తక్కువ ధరల్లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకుల వెల్లడి






**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో, ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా సాన్ ఎంటర్‌ప్రైజెస్ వారి ఆధ్వర్యంలో 'కింగ్స్ బజార్ హోమ్ నీడ్స్ జోన్'ను ఉగాది పండుగ సందర్భంగా గురువారం ఘనంగా ప్రారంభించారు. నగర ప్రజలకు నాణ్యమైన గృహావసర వస్తువులు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నూతన కేంద్రాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దుగ్గిరాల స్రవంతి, కడియాల అనిత, కడియాల నీలిమ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా ప్రజలకు బ్రాండెడ్ వస్తువులను అందుబాటు ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా హోమ్ నీడ్స్‌కు సంబంధించిన అనేక రకాల వస్తువులు, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలను ఎమ్మార్పీ ధరలకన్నా గణనీయమైన తగ్గింపుతో అందిస్తున్నామని వెల్లడించారు. వినియోగదారులు నాణ్యతతో కూడిన ఉత్పత్తులను తక్కువ ధరలో కొనుగోలు చేసేలా ప్రత్యేకంగా ఈ బజార్‌ను రూపుదిద్దామని పేర్కొన్నారు. గృహావసరాల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కుటుంబాలకు అవసరమైన పలు రకాల వస్తువులు ఒకే వేదికపై లభించేలా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు మరింత ఆకర్షణీయమైన ధరలతో వస్తువులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానికంగా వ్యాపార రంగంలో కొత్త ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభించిన ఈ కింగ్స్ బజార్ హోమ్ నీడ్స్ జోన్ మంచి ఆదరణ పొందుతుందనే ఆశాభావాన్ని నిర్వాహకులు వ్యక్తం చేశారు. నాణ్యత, తగ్గింపు ధరలు, విభిన్న ఉత్పత్తులు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ కేంద్రం ముందుకు సాగనుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చల్లగుళ్ల లెనిన్, వివిఆర్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభమైన ఈ నూతన హోమ్ నీడ్స్ జోన్ ఖమ్మం నగర ప్రజలకు మరో ఉపయోగకరమైన షాపింగ్ కేంద్రంగా నిలవనుంది.

# ప్రజారంజక బడ్జెట్: వైద్యుల అంజన్ కుమార్ ప్రశంసలు



**కరీంనగర్ టౌన్ మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర 20262027 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందని కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని, శాసనమండలిలో ఉత్తంకుమార్ రెడ్డి సమర్థంగా వివరించారని తెలిపారు. ఈ బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ, యువతకు ఉపాధి కల్పించే రాజీవ్ యువ వికాసం వంటి పథకాల కోసం భారీ కేటాయింపులు చేయడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీల అభివృద్ధికి చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా నిధులు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతుందని ఆయన కొనియాడారు. దళిత, బహుజన మరియు మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని వైద్యుల అంజన్ కుమార్ పేర్కొంటూ, ఈ బడ్జెట్ ద్వారా అన్ని వర్గాల అభివృద్ధికి బాటలు వేయబడినట్లు తెలిపారు.

# ఉగాది సందర్భంగా 18వ వార్డులో స్వీట్స్ పంపిణీ: కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ

**కల్లూరు, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉగాది పండుగను పురస్కరించుకొని కల్లూరు మున్సిపాలిటీ 18వ వార్డులో కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, డిపిఆర్ ట్రస్ట్ అధినేత దేవరపల్లి పట్టాభి స్నేహితుడు , సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అనుచరుడు రామకృష్ణ తన స్నేహితుల సమక్షంలో ప్రతి కుటుంబానికి స్వీట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని వార్డులోని ప్రతి కుటుంబానికి స్వీట్స్ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఇంటిలో సుఖసంతోషాలు నెలకొని, కుటుంబాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యకు, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ యువ నాయకులు దేవరపల్లి పట్టాభికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల నాగేశ్వరరావు, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, కాటేపల్లి రజనీకాంత్, టెక్నో సెంటర్ నాగిరెడ్డి, మోర్తాల పిచ్చిరెడ్డి, కొటికలపూడి కళ్యాణ్ కిషోర్, చారుగుండ్ల సందీప్, చారుగుండ్ల కిరణ్, బసవయ్య, ఖమ్మంపాటి బాలస్వామి,నల్లగట్ల నాగబాబు, ఖమ్మంపాటి రమేష్, గుగులోత్ బాలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 10 మందిపై కేసులు నమోదు



**ఏటూరునాగారం:మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని ఓడవాడ సమీపంలోని జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఏటూరునాగారం ఎస్సై మహేశ్ వెల్లడించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, జంపన్నవాగు పరిసర ప్రాంతంలో కొందరు వ్యక్తులు గుంపుగా చేరి పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందంతో అక్కడికి చేరుకుని దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 9,600 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలను సహించబోమని స్పష్టం చేసిన పోలీసులు, పేకాట, జూదం వంటి నిషేధిత కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలు సమాజంలో చెడు ప్రభావం చూపడమే కాకుండా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తాయని అధికారులు సూచించారు. ప్రజలు చట్టాలను గౌరవించి ఇలాంటి జూద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# జానపద ఉద్యమ కళాకారునికి ఘన సన్మానం

## రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్న జన్నె యుగేందర్



**చిట్యాల,మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రంగస్థల నటుడిగా, జానపద ఉద్యమ గాయకుడిగా గత 20 సంవత్సరాలుగా కళారంగంలో ఉంటూ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేస్తు, షార్ట్ ఫిలిమ్స్, నాటకాలు ప్రదర్శిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న జన్నె యుగేందర్‌కు రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. ఈ అవార్డును గౌరవ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు మరియు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త గారి చేతుల మీదుగా అందజేశారు. జన్నె యుగేందర్ రంగస్థల కళాకారుడిగా తన అద్భుత నటనతో పాటు జానపద గాయకుడిగా అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్, బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, ఆడపిల్లల పైన వివక్ష, విద్య వైద్యం, అంటరానితనం, సేంద్రియ వ్యవసాయం, డ్రగ్స్ గంజాయి తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పైన పాటలు , నాటకాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం చేయడం జరిగింది కళారంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కళాకారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జన్నె యుగేందర్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

# ఇక్బాల్‌కు ఘన సన్మానం




**పరకాల మార్చి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పవిత్ర రంజాన్ మాసం ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు (రోజా) పాటిస్తూ, సాయంత్రం ఇఫ్తార్‌లతో ఆధ్యాత్మికంగా గడుపుతున్నారు. ఈ సందర్భంగాపరకాల పట్టణానికి చెందిన టీ స్టాల్ ఓనర్ మహమ్మద్ ఇబ్బాల్ పరకాల బస్సు డిపోకు ఎదురుంగాకు టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గత 30 సంవత్సరాల నుంచి ప్రతి రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు దాదాపు 100 నుంచి 150 మంది వరకు టీ సప్లై చేయడం జరుగుతుంది. ఇతను ఎందరో కో ఆదర్శంగా నిలుస్తున్న సందర్భంగా శుక్రవారం రోజున ఈదిగా మసీద్ ఆవరణలో మహమ్మద్ జమాల్ ద్దీన్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మజీద్ ఇమామ్ హిమాముద్దీన్, అజీజ్ పాషా, మహబూబ్ పాషా,అఖిల్, ఆదిల్ ,అజ్జు , రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పాటల రచయితకు ఘన సన్మానం

## ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డు అందుకున్న మ్యాదరి సునీల్




**చిట్యాల మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన చెందిన యువ పాటల రచయిత మ్యాదరి సునీల్ గారుశ్రీ వివేకానంద సేవా సమితి అధ్యక్షులు కొలుగూరి సంజీవరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉగాది ఉత్సవాలలో,"అభినవ సాహిత్య కేసరి" ఉత్తమ ఉగాది పురస్కారం 2026ను అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డునుభూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణరావు గారు,జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్తి గారి చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది. సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్న మ్యాదరి సునీల్ గారికి ఈ అవార్డు మరింత ప్రేరణనిచ్చే మైలురాయిగా నిలిచింది.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**కల్లూరు, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగలో ప్రార్థనలు, వారు చేసే ఉపవాసదీక్షలతో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిములకు పవిత్రమైన రంజాన్ పండుగలో ప్రార్థనలు, వారు చేసే ఉపవాస దీక్షలతో . పవిత్ర మాసంలో పేదలకు సేవ చేసేలా ప్రజల్లో స్ఫూర్తిని కలిగించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యం, కరుణ పెంపొందాలని పిలుపునిచ్చారు. అందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు.

# ఉత్సాహంగా... ఉల్లాసంగా....

- అంగరంగ వైభవంగా శ్రేయస్ వన్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ
- ఉర్రూతలూగించిన సునీత సినీ గేయాలు
- సందడి చేసిన సినీ హీరోయిన్లు మీనాక్షి చౌదరి




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వందనం గ్రామం రోడ్డులో గురువారం సాయంత్రం అద్భుతమైన వాతావరణంలో శ్రేయస్ ఫ్యూచర్ సిటీ డెవలపర్స్ ఆధ్వర్యంలో "శ్రేయస్ వన్ సిటీ" బ్రోచర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగర అభివృద్ధికి నూతన దిశను సూచించే ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం ఉత్సాహభరితంగా, సందడిగా సాగింది. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా సినీ ప్రముఖులు హాజరై కార్యక్రమానికి మరింత మెరుగులు చేకూర్చారు. యువత హృదయాలను గెలుచుకున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులను అలరించారు. వారి సందడి, అభిమానులతో సెల్ఫీలు, నవ్వులు కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. అదే విధంగా, సినీ గాయని సునీత తన మధుర గాత్రం తో, సినీ గేయాలతో సభను ఉర్రూతలూగించారు. ఆమె పాటలకు ప్రేక్షకులు కేరింతలు కొడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శ్రేయస్ వన్ సిటీ ప్రాజెక్ట్ ఆధునిక సదుపాయాలతో, నూతన జీవన విధానానికి తగిన విధంగా రూపుదిద్దుకుంటుందని నిర్వాహకులు శ్రేయాస్ శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్ నగర రూపకల్పనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఖమ్మం నగరంలో ఒక ప్రత్యేకమైన సంబరంగా నిలిచింది. ఉత్సాహం, వినోదం, అభివృద్ధి అన్నీ కలిసిన ఈ వేడుక హాజరైన వారందరికీ చిరస్మరణీయ అనుభూతిని అందించింది.

